సేంద్రియ సమ్మేళనానికి రైతులు

సమ్మేళనంలో ఎంపీ రఘునందన్‌రావును కలిసిన గుమ్మడిదల రైతులు

గుమ్మడిదల, డిసెంబర్ 25: కృషి విజ్ఞాన్ కేంద్రంలో జరిగిన ప్రకృతి.. సేంద్రియ రైతు సమ్మేళనానికి గుమ్మడిదల రైతులు తరలివెళ్లారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని తునికిలోని కృషి విజ్ఞాన్ కేంద్రంలో జరిగిన రైతు సమ్మేళనాని గుమ్మడిదల రైతులకు ఆహ్వానం అందడంతో బుధవారం గ్రామానికి చెందిన జిల్లా రైతు నాయకుడు మద్దుల బాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, రైతులు పడమటి లక్ష్మారెడ్డి, కుంటి మల్లేశ్, చిమ్ముల దేవేందర్‌రెడ్డి, అమ్మగారి రవీందర్‌రెడ్డి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ కేంద్రానికి భారత ఉప రాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్, రాష్ట్ర మంత్రి కొండసురేఖ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తదితర ప్రముఖ నాయకులు హాజరయ్యారని తెలిపారు. సమ్మేళనంలో ఆర్గానిక్ పద్ధతిలో సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేసి ఆరోగ్య భారతావనిగా మార్చాలని సూచించినట్లు తెలిపారు. రసాయన ఎరువులను పంటల సాగుకు వాడడం వల్ల ప్రజల ఆరోగ్యం పాడవుతుందని తెలిపారు. దేశప్రజలకు ఆర్గానిక్ పద్ధతిలో సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నట్లు తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావును గుమ్మడిదల రైతులు కలిశారు. గుమ్మడిదల మండలాన్ని మున్సిపాలిటీగా మార్చవద్దని కోరినట్లు చెప్పారు.

భవిష్యనిధిలో ఫిర్యాదులకు శిబిరం

పటాన్‌చెరు, డిసెంబర్ 25: భవిష్యనిధి(ప్రావిడెంట్ ఫండ్) సంస్థలో సమస్యల పరిష్కారానికి శిబిరం ఏర్పాటు చేస్తున్నామని భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ తెలిపారు. పటాన్‌చెరులో భవిష్యనిధి సంస్థ అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 27న నిధి ఆప్కే నిఖత్ 2.0 కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. భవిష్యనిధి సంస్థలో ఉన్న సమస్యలపై ఫిర్యాదులు తీసుకొని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మూడు చోట్ల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 వరకు పీఎఫ్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. భవిష్య నిధిపై సమస్యలున్నవారు బీహెచ్ఈఎల్ మెయిన్ ఎంట్రెన్స్ గేట్, మెదక్ జిల్లాలోని నర్సాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి మున్సిపాలిటీలోని జిల్లా కోర్టు వెనుక జలబాగ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్, తదితరులు

రామచంద్రాపురం, డిసెంబర్ 25: ఆర్సీపురం పద్మశాలీ సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ని సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు జక్క మల్లేశ్‌తో కలిసి కార్పొరేటర్ పుష్పానగేశ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్మశాలి సంఘం సభ్యులందరూ కలిసికట్టుగా సంఘాన్ని బలోపేతం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సురేందర్, పెంటయ్య, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, మురళి, సంయుక్త కార్యదర్శులు రాజశేఖర్, రాములు, ఉప ప్రధాన కార్యదర్శి భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్లు శివకుమార్, మహేందర్, కోశాధికారి రవికుమార్, కార్యదర్శులు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు కొబ్బరికాయల విక్రయానికి వేలం

గుమ్మడిదల, డిసెంబర్ 25: జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కొబ్బరికాయలు విక్రయించుకోవడానికి వేలంపాటను నిర్వహిస్తున్నట్లు ఈవో శశిధర్‌గుప్తా బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో ఏడాదిపాటు కొబ్బరికాయలను విక్రయించుకునేందుకు శుక్రవారం ఉదయం 10 గంటలకు వేలంపాటను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ వేలంపాటలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు నిర్ణీత ధరావతు చెల్లించిన తర్వాత వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

పరిశ్రమ పనులు కొనసాగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న రాళ్లకత్వ గ్రామస్తులు

బొల్లారం, డిసెంబర్ 25: జిన్నారం మండలం రాళ్లకత్వ శివారులోని సర్వే నంబర్ 286 అసైన్డ్ భూముల్లో అక్రమంగా బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ పనులు కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పరిశ్రమ నిర్వాహకులు పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు స్థానిక చెరువులో కలిసి నీళ్లు కలుషితమవుతాయని, పంట పొలాలకు, పశువులకు నీరు తాగే పరిస్థితి ఉండదని వాపోయారు. తక్షణమే పనులు నిలిపివేసి పశు సంపదతోపాటు చెరువులు, కుంటలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆది రామకృష్ణ, గణేశ్, రవీందర్ ఉన్నారు.

వట్‌పల్లి: మర్వెల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న గ్రామ నాయకులు

అందోల్: జోగిపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, క్రైస్తవులు

బొల్లారం: బెరాక చర్చిలో కేక్ కట్ చేస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- హాజరైన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుకొన్నారు. ఉదయాన్నే స్నానాలు అచరించిన క్రైస్తవులు కొత్త దుస్తులు ధరించి చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం గీతాలాపనలు, బైబిల్ పారాయణాలతో చర్చిలు మార్మోగాయి. అనంతరం ఆయా గ్రామాల చర్చిల్లో పాస్టర్లు, గ్రామాల క్రైస్తవ సంఘం ప్రముఖులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చి ఆవరణల్లో ప్రత్యేకంగా భజన, ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. జహీరాబాద్ పట్టణంలోని మెథడిస్టు చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్, టీజీఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ హైమద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 25

జహీరాబాద్: మెథడిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

రామచంద్రాపురం: భారతీనగర్‌లో క్రిస్మస్ వేడుకలో పాల్గొని మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

నారాయణఖేడ్: రుద్రారం చర్చిలో భక్తుల ప్రార్థనలు

గుమ్మడిదల: క్రిస్మస్ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

రాయికోడ్: మెథడిస్ట్ చర్చిలో..

పటాన్‌చెరు: మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



మనూరు: చర్చిలో క్రిస్మస్ వేడుకలు జరుపుకొంటున్న క్రైస్తవులు

రూ.6.5 కోట్ల విలువైన ఆల్పాజోలం పట్టివేత

అనంతారం పారిశ్రామికవాడలో ఆల్పజోలం పట్టుబడిన శ్రీవత్స లైఫ్ సైన్సెస్ పరిశ్రమ

గుమ్మడిదల, డిసెంబర్ 25: సంగారెడ్డి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూళనకు టీజీ న్యాబ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గోప్యంగా దాడులు చేస్తూ మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకొని నిందితులను కటకటాల వెనక్కి పంపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణాజిల్లా రెడ్డిగూడెంకు చెందిన రమేశ్‌రెడ్డి ఆర్గానిక్స్‌లో పీజీ చేసి డ్రగిస్ట్‌గా మారాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని అనంతారం పారిశ్రామిక వాడలోని శ్రీవత్స లైఫ్ సైన్సెస్ ఫ్యాక్టరీలో ఓ రియాక్టర్‌ను అద్దెకు తీసుకొని కొంతకాలంగా ఆల్పాజోలం తయారు చేస్తున్నాడు. సెప్టెంబర్‌లో షాద్‌నగర్ టోల్‌ప్లాజా వద్ద ఎన్సీబీ అధికారుల తనిఖీలో ఆరు కిలోల ఆల్పాజోలంను పట్టుకున్నారు. దీనిని సరఫరా చేస్తున్న 85 ఏండ్ల వృద్ధుడిని అరెస్ట్ చేశారు. విచారణలో పెద్దఎత్తున ఆల్పాజోలం తయారు చేస్తున్నట్లు గుర్తించిన టీజీ న్యాబ్ అధికారులు ఆ దిశగా విచారణ చేపట్టారు. చివరకు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అనంతారం పారిశ్రామికవాడలోని శ్రీవత్స లైఫ్ సైన్సెస్ పరిశ్రమ కేంద్రంగా ఆల్పాజోలం తయారవుతున్నట్లు గుర్తించి సోమవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.6.5 కోట్ల విలువైన 32.5 కిలోల ఆల్పాజోలంను స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం రాత్రి అధికారులు వివరాలు వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి టీజీ న్యాబ్ అధికారులు ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 చట్టం కింద పరిశ్రమకు గేటుకు నోటీస్ అతికించారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'కాంగ్రెస్ హిందువులపై కక్ష గట్టింది'

అందోల్, డిసెంబర్ 25: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష గట్టిందని అఖిల భారత బజరంగ్‌దళ్ సంయోజక్ నీరజ్ దోనేరియా ఆరోపించారు. బుధవారం జోగిపేటలో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున శౌర్య యాత్ర నిర్వహించారు. పట్టణంలోని వీధుల గుండా త్రిశూల్ దీక్ష కార్యక్రమం, భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో కేవలం హిందువులు చేపట్టే కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో హిందుత్వాన్ని అంతం చేయడానికి కొన్ని శక్తులు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఎవరెన్ని కుట్రలు చేసినా హిందుత్వాని అనచడం సాధ్యం కాదన్నారు. హిందువుల రక్షణ కోసం ప్రతీ గ్రామంలో బజరంగ్‌దళ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి హిందువు హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు పవన్‌కుమార్, ధర్మప్రచార్ ప్రముఖ్ సుభాశ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి, డిసెంబర్ 25 : కొమురవెల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని కొమురవెల్లి, ఐనాపూర్, గౌరాయపల్లి, కిష్టంపేట, రాంగసాగర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు బుధవారం విద్యుత్ శాఖ ఏఈ మధు తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరాలో భాగంగా జరిగే అంతరాయనికి వినియోగదారులు సహకరించాని కోరారు.

అంబేద్కర్ బాటలో పయనించాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 25 : రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తూ ఆయన చూపిన బాటలో పయనించాలి కుల వ్యతిరేఖ పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యిదర్శి అభినవ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి టౌన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మనుస్మృతిని దహనం బ్యానర్ ప్రదర్శిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కొందరూ మనుషులను మనుషులుగా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రతి ఒక్కరూ బాబా సాహెబ్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ ప్రజా స్వామిక హక్కులను కాపాడుకోవాలన్నారు.

పండుగపూట విషాదం

- కరెంట్ షాక్‌తో యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో ఘటన

సోఫాన్(ఫైల్)

కల్హేర్, డిసెంబర్ 25: క్రిస్మస్‌ను పురస్కరించుకొని చర్చి ఎదుట ఏర్పాటు చేసిన పాత జెండాను తీసి కొత్త జెండాను కట్టేందుకు ఇనుప పైపును దించుతున్న క్రమంలో నలుగురికి విద్యుత్ షాక్ తగటడంతో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పండగపూట యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. క్రిస్మస్ సందర్భంగా చర్చి ఎదుట ఏర్పాటు చేసిన పాత జెండాను తీసివేసి కొత్త జెండాను కట్టేందుకు రాసాలం సోఫాన్, ధన్‌రాజ్, మోహన్, బాలప్ప, దేవిదాస్ ఇనుప పైపు తీస్తున్నారు. ఈ క్రమంలో పక్కన ఉన్న విద్యుత్ తీగలపై పైపు పడడంతో నలుగురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించగా రాసాలం సోఫాన్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దేవిదాస్‌కు తీవ్ర గాయం కావడంతో సంగారెడ్డి సర్కార్ దవాఖానకు తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేదింటి బిడ్డకు పుస్తెమట్టెలు అందజేత

వధువు తల్లిదండ్రులకు పుస్తెమట్టెలు అందజేస్తున్న యువజన నాయకుడు సాయి గౌడ్

బొల్లారం డిసెంబర్ 25: జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామానికి చెందిన ఒగ్గు శ్రీనివాస్, జయమ్మ దంపతుల కూతురు వివాహానికి గ్రామానికి చెందిన యువజన నాయకుడు సాయిగౌడ్ పుస్తెమట్టెలు అందజేశారు. వధువు తల్లిదండ్రులు సాయిగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్‌కే యువసేన సభ్యులు పోశయ్య, మహేశ్, ప్రకాష్, గణేశ్, మధు, ప్రశాంత్, సతీశ్, లడ్డు, ఆంజనేయు లు, చంద్రశేఖర్, నాగరాజు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ గడిల శ్రీకాంత్ గౌడ్

బొల్లారం, డిసెంబర్ 25: జిన్నారం మండల కేంద్రంలోని తాంబేలు గుట్టపై నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు గడిల శ్రీకాంత్‌గౌడ్ విరాళం అందించారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు శ్రీకాంత్ గౌడ్ తన నివాసరంలో రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న నాయకుడిని కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకుడు వెంకటేష్‌గౌడ్, రామాలయ కమిటీ చైర్మన్ భోజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ గౌడ్, మందరమేశ్, లింగం, నర్సింగరావు, మల్లేశ్, నిఖిల్‌గౌడ్, అనిల్, ఎల్లయ్య పాల్గొన్నారు.

రూ.పది నాణెం పదిలమే..

- పది రూపాయల నాణెంపై వీడుతున్న అపోహలు
- చిరు వ్యాపారులు, గ్రామస్థాయిలో వీడని అనుమానాలు!
- జనాల్లో పది రూపాయల నోట్ల కొరత
- విరివిగా చలామణిలోకి వస్తున్న నాణెం

బొల్లారం, డిసెంబర్ 25: ఓ పక్క 10 రూపాయల నాణెం చెల్లుతుందని ఆర్బిఐ చెబుతున్నా అక్కడక్కడా నాణేలు తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ, చివరికి పెట్రోలు బంకుల్లోనూ సైతం ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. పది రూపాయల నోట్ల స్థానంలో ఐదేండ్ల క్రితం 10 నాణేలను ఆర్బిఐ అందుబాటులోకి తెచ్చింది. కొంతకాలం ఈ నాణేలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్ల నుంచి దుకాణదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తూ వచ్చారు. 10 నాణేలు వినియోగంలోనే ఉన్నాయంటూ ఆర్బీఐ చెబుతున్నా సామాన్య జనాలు, చిరు వ్యాపారులు గ్రామాల్లో అక్కడక్కడా వాటిని తీసుకునేందుకు వెనకాడుతున్నారు. ఇటీవల పది రూపాయల నోట్ల కొరత ఏర్పడింది. ఇందుకు ప్రత్యామ్నాయంగా పది నాణెం చలామణి అవుతుందని చెబుతున్నా కొంతమంది వ్యాపారులు, సామాన్య ప్రజలు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు.

పది రూపాయల నోట్ల కొరతతోనే..

ఆర్బీఐ 2019లో పది రూపాయల నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో నాలుగు రకాలుగా విడుదల చేసింది. పది రూపాయల నోటు ఎక్కువ కాలం మన్నికగా ఉండదనే భావనతో సుమారు 20 ఏండ్లపాటు చలామణిలో మన్నికగా ఉండేలా ఆర్బీఐ 10 రూపాయల నాణేన్ని అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణెం తర్వాత పది రూపాయల నాణెం విలువైనది. ఇప్పటికీ ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా చలామణిలో ఉన్న కూడా మన మండలంలో అందుబాటులో లేదు. మహా నగరాల్లో సైతం పది రూపాయల నాణెం చెల్లుబాటులో ఉంది. పలుచోట్ల పది రూపాయల నాణేన్ని విరివిగా ఉపయోగిస్తున్నా.. మండలంలో అక్కడక్కడా తిరస్కరిస్తున్న పరిస్థితి నెలకొంది. పది పదిలమేనా కాదా అనే అనుమానాలు స్థానిక జనాల్లో వ్యక్తమవుతున్నాయి.

కొందరు తీసుకోవడం లేదు

వినియోగదారులతో క్రయవిక్రయాలు జరిపే సమయంలో పది రూపాయల నాణెం ఇస్తే తీసుకుంటున్నాం. తిరిగి మేము ఇస్తే వినియోదారులు నిరాకరిస్తున్నారు. దీంతో మండల కేంద్రంతోపాటు మారుమూల గ్రామాల్లో గందరగోళం నెలకొంది. నాణెంపై చిరు వ్యాపారులకు, ఆటో డ్రైవర్లు, పెట్రోల్ బంక్ సిబ్బందికి, సామాన్య జనాలకు బ్యాంక్ అధికారులు అవగాహన కల్పించాలి.

- ఫణిభూషణ్, వర్తకుడు, జిన్నారం

ఎక్కడైనా చెల్లుబాటు అవుతాయి

పది రూపాయల నాణెంపై ఎటువంటి అపోహలు సృష్టించొద్దు. నాణెం ఎక్కడైనా చెల్లుబాటు అవుతుంది. రోజువారి లావాదేవిలకు నాణేన్ని ఉపయోగించవచ్చు. వ్యాపారస్తులు, వినియోగదారులు పది రూపాయల నాణేలను నిరభ్యంతరంగా బ్యాంకులో డిపాజిట్ చేసి మార్చుకోవచ్చు. ఆర్బీఐ సూచనలను అతిక్రమించవద్దు. పది నాణేలపై ఖాతాదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- రాజు, ఏపీజీవీబీ మేనేజర్, జిన్నారం